ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 10 అక్టోబరు 2025

## రేపు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం

శ్రీకాకుళం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్ష కమిటీ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులందరూ పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు.

# ధాన్యం కొనుగోలుకు రెడీ



పాతపట్నం: కొరసవాడలో విక్రయానికి సిద్ధమైన ధాన్యం

- జిల్లాలో 530 కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు
- 4 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించే అవకాశం

నరసన్నపేట/పాతపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు జిల్లా అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 530 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. రవాణాలో అవకతవకలు చోటుచేసుకోకుండా 5,135 వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేయనున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో 3.75 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. వర్షాలు సమృద్ధిగా కురిసి.. వాతావరణం అనుకూలించడంతో వరిపైరు ఏపుగా పెరిగింది. సుమారు 4.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. వీటిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ సేకరించనుంది. సారవకోట, పాతపట్నం, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట మండలాల్లో జగిత్యాల రకాలు మరో వారం రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉంది. రైతులు తమ వెసులుబాటును బట్టి నూర్పిడి చేసి, ధాన్యం విక్రయిస్తారు. ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు, రైతులకు డబ్బుల చెల్లింపు విషయంలో ఎక్కడా అన్నదాతలకు ఇబ్బంది (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

## ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'ధాన్యం సేకరణపై గ్రామ, మండల స్థాయిలో సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. వర్షాల నుంచి రక్షణకు రైతులకు టార్పాలిన్లు అందజేయాలి. ఏ సమస్య ఉన్నా.. నా దృష్టికి తీసుకురావాల'ని ఆదేశించారు. ఈ-క్రాప్ నమోదుపై ఆరా తీయగా.. 5 లక్షల మందికి ప్రక్రియ పూర్తయిందని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ.. 'గత సమస్యలు పునరావృతం కాకుండా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి. ఒక ప్రణాళిక తయారుచేసి రైతులకు ముందుగానే తెలియజేయండి. 530 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుంది. ధాన్యం తేమ శాతం తెలుసుకునేందుకు అక్కడే మిషన్లు ఏర్పాటు చేస్తాం. రైస్‌మిల్లు, రైతు సేవా కేంద్రాల వద్ద ఒకే కంపెనీ మిషన్లు ఉండాలి. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. జీపీఎస్ గల 5,135 వాహనాలను ధాన్యం రవాణాకు కేటాయిస్తామ'ని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో కె.సాయిప్రత్యూష, డిప్యూటీ కలెక్టర్లు జి.జయదేవి, బి.పద్మావతి, తహసీల్దార్లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పౌరసరఫరాలశాఖ అధికారులు పాల్గొన్నారు.

# కుక్కలు చంపేస్తున్నాయ్!



- జిల్లాలో తరచూ ఘటనలు
- అధికమవుతున్న బాధితులు
- అయినా పట్టని అధికారులు
- కానరాని సుప్రీంకోర్టు ఆదేశాలు

- ఈ ఏడాది ఆగస్టు 18న బూర్జ మండలం తోటవాడకు చెందిన దన్నాన అప్పమ్మ అనే 70ఏళ్ల వృద్ధురాలు తీవ్ర అనారో గ్యంతో చనిపోయారు. కొద్దిరోజుల కిందట కుక్కలు దాడి చేయ డంతో తీవ్ర గాయాలపాలైన అప్పమ్మను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకున్న ఆమె ఇంటి వద్ద ఉండగా మరో సారి అస్వస్థతకు గురై మృతి చెందారు.
- ఈ ఏడాది జూలైలో మురపాకకు చెందిన బొడ్డ అజయ్ అనే యువకుడు తీవ్ర అనారోగ్యానికి గురై మృతిచెందాడు. అప్పటికి రెండు నెలల కిందట వీధికుక్క కాటు వేసింది. రేబిస్ టీకా వేయించుకోకుండా నిర్లక్ష్యం చేశాడు. దీంతో రేబిస్ వ్యాధి తిరగబెట్టింది. ఆస్పత్రికి తరలించేలోపే మృత్యువాతపడ్డాడు.
- రణస్థలం పరిసరాలతోపాటు పొలాలు, తోటల్లో సైతం కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. దాదాపు ఇరవై కుక్కలు గుంపులుగా తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వాటిని చూసి పొరపాటున ఎవరైనా భయంతో పరుగులుతీస్తే.. వెంటపడి దాడి చేస్తున్నాయి. కుక్కల బారి నుంచి రక్షణ కల్పించాలని ఈ ప్రాంత వాసులు అధికారులను వేడుకుంటున్నారు.



వేల్పురాయి మామిడి తోటలో కుక్కల గుంపు

రణస్థలం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పలువురు కుక్కకాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. అయినా వాటి నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధికుక్కల సంరక్షణకు పట్టణాల్లోని ప్రతివార్డులో సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కొన్నాళ్ల కిందట సుప్రీంకోర్టు ఆదేశించింది. అక్కడ వాటికి ఆహారం ఇవ్వాలని సూచించింది. కానీ ఈ దిశగా అధికారులు సన్నాహాలు చేపట్టడం లేదు. కనీసం ఎన్ని వీధికుక్కలు ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి. జిల్లాలో ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 2వేల మంది వరకూ కుక్కకాటు బాధితులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి ప్రతినెలా సుమారు 200 మంది కుక్కకాటు బాధితులు వస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**మూతపడిన కేంద్రాలు..**

వీధికుక్కల నియంత్రణకు శ్రీకాకుళం కార్పొరేషన్‌లో గతంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. రూ.25లక్షలతో షెడ్లు ఏర్పాటు చేసి.. పదుల సంఖ్యలో శస్త్రచికిత్సలు కూడా చేశారు. తరువాత ఎందుకో ఆపేశారు. కొన్నాళ్ల తరువాత (మిగతా 6వ పేజీలో..)

### పిచ్చికుక్క దాడి.. పది మందికి గాయాలు



కుక్కకాటుతో బాధపడుతున్న నరేష్

ఇచ్ఛాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో రోజురోజుకీ వీధికుక్కల బెడద పెరిగిపోతోంది. గురువారం మునిసిపాలిటీలోని సత్యసాయిబాబా వీధిలో పిచ్చి కుక్క దాడి చేయగా.. పది మందికి తీవ్రగాయాలయ్యాయి. వారంతా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. పాలు విక్రయించే నరేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెంబడించి దాడి చేసింది. మునిసిపాలిటీలో కుక్కల దాడులు పెరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, స్థానికులు పేర్కొంటున్నారు.



కొత్త ఉపాధ్యాయులకు

## నేడు పాఠశాలలు కేటాయింపు

- జిల్లాలో 528 మందికి నియామక ఉత్తర్వులు

నరసన్నపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త ఉపాధ్యాయులకు శుక్రవారం పాఠశాలలు కేటాయించనున్నారు. శ్రీకాకుళంలోని నాలుగు కేంద్రాల్లో 528 మంది కొత్త ఉపాధ్యాయులు ఈ నెల 3వ తేదీ నుంచి శిక్షణ పొందుతున్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు గురువారం వెబ్‌ఆప్షన్ నమోదు చేసుకున్నారు. వారందరికీ శుక్రవారం పాఠశాలల కేటాయింపుతోపాటు నియామక ఉత్తర్వులు అందజేయ నున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి రవిబాబు తెలిపారు. జిల్లాలోని మైదాన ప్రాంతంలో 458 పోస్టులు, ట్రైబుల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 85 పోస్టులకు మొత్తంగా 543 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాగా.. కొంతమంది మూడేసి పోస్టులకు ఎంపికయ్యారు. అటువంటివారు అన్‌విల్లింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో 528 మంది మాత్రమే ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు విల్లింగ్ ఇచ్చి శిక్షణకు హాజరయ్యారు. కొత్త ఉపాధ్యాయుల్లో 447 మంది జిల్లా పరిషత్, మండల పరిషత్, పురపాలకసంఘ పాఠశాలల్లోను, 81 మందికి గిరిజనసంక్షేమ శాఖ పాఠశాలల్లో ఉత్తర్వులు ఇవ్వనున్నారు. వీరికి కేటగిరి 3,4 పాఠశాలలను కేటాయించనున్నారు. కొత్త ఉపాధ్యాయులంతా కేటాయించిన పాఠశాలలకు ఈనెల 11న రిపోర్టు చేయాలని డీఈవో రవిబాబు స్పష్టం చేశారు.

## రేపటి నుంచి జీఎస్టీ సేవింగ్స్‌పై ఎగ్జిబిషన్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 11, 12 తేదీల్లో జీఎస్టీ 2.0 సూపర్ సేవింగ్స్ ఎలక్ట్రానిక్స్ వస్తువుల గ్రాండ్ ఎగ్జిబిషన్ కమ్ సేల్స్ నిర్వహిస్తున్నట్లు జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ స్వప్నదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు ఎంతో ఊరట కలుగుతుంది. జీఎస్టీ మార్పులు, పన్ను రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాల'ని పిలుపునిచ్చారు.

## నేషనల్ యూత్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సమాజ సేవ చేయాలనే ఆసక్తి గల యువతకు కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ యూత్ వలంటీర్లు' ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఏడాదిపాటు స్వచ్ఛంద సేవ చేసేందుకు ఆసక్తి గల 18 నుంచి 29 ఏళ్ల మధ్య యువతీ యువకులు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలి. కనీసం 10వ తరగతి విద్యార్హత ఉండాలి. ఎంపికైన వలంటీర్లకు నెలకు రూ.5వేలు స్టైఫండ్ చెల్లిస్తాం. యువజన సంఘాల స్థాపన, క్రీడలు, ఆరోగ్యం, అక్షరాస్యత, పారిశుద్ధ్యం, లింగ వివక్ష, డిజిటల్ అక్షరాస్యత వంటి అంశాలపై వీరు పనిచేయాల్సి ఉంటుంది. ఉన్నత విద్యార్హత, కంప్యూటర్ అప్లికేషన్స్, అండ్రాయిడ్ మొబైల్ ఫోన్ కలిగి, ఈ-బ్యాంకింగ్, డిజిటల్ వంటి మొబైల్ అప్లికేషన్లలో పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం కల్పిస్తాం. మరిన్ని వివరాలకు 08942-222028 నెంబరును సంప్రదించాల'ని ఆయన సూచించారు.

## తెప్ప బోల్తాపడి మత్స్యకారుడి మృతి



చినబాబు మృతదేహం

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ గ్రామానికి చెందిన బుడగట్ల చినబాబు(42) సముద్రంలో చేపలవేటకు వెళ్లి.. తెప్ప బోల్తా పడిన సంఘటనలో మృతిచెందారు. గురువారం ఉదయం ముగ్గురు మత్స్యకారులతో కలిసి ఆయన చేపలవేట కోసం సముద్రంలోకి వెళ్లారు. అలల ఉధృతికి తెప్ప బోల్తా పడడంతో ఆ నలుగురూ సముద్రంలో పడిపోయారు. ముగ్గురు మత్స్యకారులు తెప్పపైకి చేరుకున్నారు. కానీ చినబాబు మాత్రం సముద్రంలోకి కొట్టుకుపోయారు. తోటి మత్స్యకారులు గాలించి చినబాబును ఒడ్డుకు చేర్చినా, అప్పటికే ఆయన మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు విలపించారు. మృతుడి తల్లి గుణశరమ్మ ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలిపారు.

# మునిసిపాలిటీల్లో ఈడీసీ

- నాలాకు బదులు కొత్త విధానం అమలు
- భూమి విలువలో నాలుగు శాతం పన్ను
- ఆ నిధులూ పట్టణాభివృద్ధికి ఖర్చు



పలాస -కాశీబుగ్గ మునిసిపల్ కార్యాలయం



పలాస, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చడానికి గతంలో నాలా(నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్‌మెంట్) ట్యాక్స్ అమలులో ఉండేది. ప్రజాసౌలభ్యం కోసం దీన్ని రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల కిందట రద్దు చేసింది. దీంతో అనేక ప్రాంతాల్లో ఎటువంటి పన్ను చెల్లించకుండా వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్లుగా తయారు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి నాలా బదులు ఎక్స్‌టర్నల్ డెవలప్ మెంట్ చార్జెస్(ఈడీసీ) విధానాన్ని అమలు చేయాలని గత నెల 3న ఆదేశాలు జారీ చేసింది. కానీ జిల్లాలో ఇంకా అమలుకు నోచుకోలేదు. ఈడీసీ అమలుపై బుధవారం ఏపీసీఆర్‌డీఏ బుధవారం ప్రత్యేక జీవో విడుదల చేసింది. దీని ప్రకారం కార్పొరేషన్లు, మునిసిపాలిటీలతోపాటు గ్రామ పంచాయతీల్లో కూడా టౌన్‌ప్లానింగ్ చట్టం 1920 కింద అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కన్వర్షన్ పొందిన భూములు, 2006 సంవత్సరం జనవరి 2కు ముందు ప్లాట్లుగా చేసిన భూములకు ఈ చట్టం వర్తించదని స్పష్టం చేసింది.

- గతంలో నాలా పన్ను వసూలు చేస్తే కేవలం రెవెన్యూశాఖకు నగదు జమయ్యేది. దీన్ని బదలాయించాల్సి ఉన్నా ప్రత్యేక అజమాయషీ దీనికి లేకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు జమయ్యేది. కానీ ఈడీసీలో మాత్రం నిధులు మొత్తం మునిసిపాలిటీల్లోని మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, పార్కులు అభివృద్ధికి వినియోగించుకోవచ్చు. దీన్ని అమలు చేసే బాధ్యత ఆయా మున్సిపాలిటీలు, నగరపాలకసంస్థల కమిషనర్లకు బాధ్యతలు అప్పగించింది.
- జిల్లాలో శ్రీకాకుళం నగరపాలక సంస్థతోపాటు పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాలవలస మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా వందల (మిగతా 6వ పేజీలో..)

**ఆన్‌లైన్‌లోనే..**

గతంలో లేఅవుట్లు వేయాలంటే మునిసిపాలిటిల్లో దరఖాస్తు చేసుకుంటే సరిపోయేది. కానీ ప్రస్తుతం మాత్రం అన్నీ అనుమతులు ఆన్‌లైన్‌లో ఏపీడీపీఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లోనే సంబంధింత రుసుం చెల్లించాలి. మొత్తం భూమి, వాటి విలువ, ఏ ప్రాంతంలో ఉందనేని అందులోనే పొందుపరచాలి. భూమి విలువలో 4 శాతం ఈడీసీగా చెల్లించాలి. ఇందులో 85శాతం నిధులు ఆయా మునిసిపాలిటీ ఖాతాల్లోను, మిగిలిన 15 శాతం అభివృద్ధి అథారిటీకి వెళ్తుంది. ఇందులో తప్పుడు సమాచారం ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేసుకుంటే రెట్టింపు జరిమానా విధిస్తారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో అన్నీ పత్రాలు సక్రమంగా ఉంటే అనుమతులు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.




### నిలిచిన గ్రామీణ బ్యాంకు సేవలు

- నాలుగు బ్యాంకుల విలీనమే కారణం
- ఈ నెల 13న పునరుద్ధరణ

6లో

### మనసు ఆరోగ్యమూ ముఖ్యమే

- శరీరంపై ఉన్న శ్రద్ధ మనసుపై ఏదీ?
- జిల్లాలో అధికమవుతున్న కేసులు
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినం

6లో

### థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రతిపాదనను విరమించాలి

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

7లో

### సారా రహిత జిల్లా లక్ష్యం

- విద్యార్థులకు సురక్షిత నీటిని అందించాలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

7లో

### షెడ్డే గూడు.. చెట్టే నీడ!

- సొంతగూటికి నోచుకోని మందస అగ్నిమాపక కార్యాలయం

8లో

# మనసు ఆరోగ్యమూ ముఖ్యమే



- శరీరంపై ఉన్న శ్రద్ధ మనసుపై ఏదీ?
- జిల్లాలో అధికమవుతున్న కేసులు
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినం

ఎచ్చెర్ల/రాజాం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలామంది చిన్నచిన్న కారణాలతో మానసిక ఒత్తిడిని తట్టుకోలేక అఘాయిత్యాలకు, ఆత్మహత్యలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మారుతున్న జీవన శైలితో మనిషి మానసిక దృఢత్వాన్ని కోల్పోతున్నారు. దీనికితోడు మనిషి జీవితం యాంత్రీకరణగా మారిపోయింది. క్షణం తీరక లేకుండా గడుపుతున్న తరుణంలో ఒత్తిడి తట్టకోలేక చాలా మంది మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు. వాటి నుంచి బయటపడలేక జీవితానికి నష్టం కలిగించుకుంటున్నారు. మంచి వ్యాయామం, పౌష్టికాహారంతో వ్యాధులను దూరం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కథనం..

### కరోనా తరువాత అస్తవ్యస్తం..

మనిషి శారీకంగా ఎంతో ఆరోగ్యంగా ఉన్నా.. మానసికంగా ప్రశాంతత లోపిస్తే అనర్థాలు చోటుచేసుకుంటాయి. దీర్ఘకాలిక రుగ్మతలు వ్యాపిస్తాయి. కరోనా తరువాత మనిషి విపరీతమైన మానసిక రుగ్మతలకు గురవుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనంలో తేలింది. సరైన అవగాహన కల్పించాలని, మెరుగైన చికిత్స అందించాలని అన్ని దేశాలకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. సరైన వ్యాయామం, పోషకాహారం దివ్య ఔషధాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అవి ప్రతిరోజూ మనిషి జీవితంలో భాగమైతే దృఢత్వంగా, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ మానసిక రుగ్మతలనేవి.. అనేక రూపాల్లో వెలుగు చూస్తుంటాయి. ప్రధానంగా మద్యంతాగే అలవా టున్నవారికి మానసిక రుగ్మతలు ఎక్కువగా సోకుతా యని నిపుణులు చెబుతున్నారు.

### వ్యసనాల బారినపడి..

జిల్లాలో ప్రతినెలా మద్యానికి బానిసై సగటున 600 మంది, కుంగుబాటుతో మరో 700 మంది, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి మరో 400 మంది ఆస్పత్రులకు వస్తుంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే కరోనా తరువాత ఇలాంటి రోగుల సంఖ్య పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అప్పట్లో ఇలాంటి వారు 100 నుంచి 200 మంది దాకా ఉండేవారని, ఇప్పుడు ఆ సంఖ్య పెరిగిందని అంటున్నారు. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, వ్యసనాలకు బానిస కావడం, కుటుంబ స్థితిగతులు దిగజారడం వంటివి మానసిక వ్యాధులకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

### ఈ లక్షణాలైతే జాగ్రత్త పడాలి..

మానసిక రోగుల లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఒకే పనిని పలుమార్లు చేయడం.. కడిగింది మళ్లీ మళ్లీ కడగడం.. ఈ చర్యలనే ఓసీడీ (ఆబ్సెస్సివ్ కంపల్సరి డిసార్డర్) అంటారు. ఇంటికి తాళం వేశాక సరిగ్గా పడిందా? లేదా? అని అదేపనిగా చూసుకోవడం.. మద్యం తాగి పిచ్చిగా వాగడం.. మాదక ద్రవ్యాలకు బానిసై నేర ప్రవృత్తిని ఎంచుకోవడం.. ఒక విషయాన్ని చూసి, విని, చదివి విపరీతంగా గాబరా పడడం.. వీటినే హైపర్ టెన్షన్ కూడా అంటారు. అందరిలో నేనే గొప్ప అని చెప్పడం.. అరవడం కూడా వ్యాధి లక్షణమే. చిన్నారుల్లో అయితే మొండిగా వ్యవహరించడం, కోపంగా చూడడం, అతిగా సెల్‌ఫోన్ వాడడం వంటివి విపరీత లక్షణాలే. పెద్దవాళ్లలో అయితే అతిగా మతిమరుపు, లైంగిక సమస్యలతో బాధపడడం వంటివి మానసిక రోగుల లక్షణాలు.

### యోగా మంచి చిట్కా..

మానసిక ప్రశాంతతకు, ఆరోగ్యానికి యోగా మంచి చిట్కా. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో 45 నిమిషాల పాటు యోగా చేస్తే మంచి ఫలితం చూపుతుంది. సూర్యనమస్కారాలు, సూక్ష్మ వ్యాయామాలతో మానసిక ఒత్తిడి నుంచి దూరం కావొచ్చు.శ్వాసపై ధ్యాస పెట్టి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

-టీటీవీ రమణమూర్తి, యోగా శిక్షకుడు

### ప్రశాంతంగా ఉండాలి..

మనిషి మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా వీలైనంతవరకూ ఒత్తిడికి దూరంగా ఉండాలి. తెల్లవారు లేచింది మొదలు బతుకు పోరాటం సాగిస్తున్నాడు. ఇటువంటి సమయంలో విశ్రాంతి కరువు అవుతోంది. అది శరీరంపై ప్రభావం చూపుతుంది. అందుకే వీలైనంత వరకూ ప్రశాంతతను అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా వ్యాయామం, సరైన ఆహారం తీసుకోవడం చాలా ఉత్తమం.

-ఎం.రమేష్‌బాబు, సైకాలజిస్టు

### ఒత్తిడిని తగ్గించుకుంటేనే..



ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతూనే ఉంటారు. దీంతోనే మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఈ కారణంగా శారీరక ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుంది. ఒత్తిడిని తగ్గించుకునే మార్గాలను అన్వేషించుకోవాలి. ప్రశాంత వాతారణాన్ని కల్పించుకుని తోటి ఉద్యోగులతో స్నేహంగా ఉండేందుకు ప్రయత్నించాలి. శక్తి సామర్థ్యాల మేరకు వృత్తిని ఎంచుకోవడం వల్ల చాలా వరకు మానసిక ఒత్తిడిని దూరం చేయొచ్చు. వృత్తి రీత్యా ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. మనసును నియంత్రించుకుని ఒత్తిడికి గురికాకుండా పనిలో విజయం సాధించుకుంటూ పోతే సత్ఫలితాలు సాధించగలం.

-డాక్టర్ ఎన్ఎన్ రాజు, పూర్వ జాతీయ అధ్యక్షులు, భారత మానసిక వైద్య సంఘం, విశాఖపట్నం

### గుర్తించడం ముఖ్యం..

మానసిక వ్యాధికి నిర్దేశించలేం. మనిషిలో వచ్చిన మార్పులకు అనుగుణంగా అంచనా వేయాల్సి ఉంటుంది. దీన్ని వాడుక భాషలో మతి భ్రమణం, పిచ్చి అని భావిస్తుంటారు. దీని నిర్ధారణకు ప్రత్యేకమైన పరీక్షలంటూ ఉండవు. వ్యక్తి ప్రవర్తలో మార్పులు, దైనందిన జీవితంపై వీటి ప్రభావం ఎలా ఉంటుందన్న విషయాలను కుటుంబ సభ్యులు గమనించి వైద్యసేవలు అందించాల్సి ఉంటుంది.

# ధాన్యం కొనుగోలుకు రెడీ

(ఐదో పేజీ తరువాయి)

పడకుండా జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ధాన్యాన్ని కళ్లాల నుంచి నేరుగా కొనుగోలు చేసి మిల్లలకు తరలించేలా వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేయాలని స్పష్టం చేశారు.

### మద్దతు ధరకే కొనుగోలు..

ఈ ఏడాది ధాన్యం మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2,389, సాధారణ రకం రూ.2,369కు కొనుగోలు చేయాలని నిర్ధేశించింది. ధాన్యం కొనుగోలు ముందే ఈ-క్రాప్, ఈ-కైవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా కస్టోడియన్ అధికారులను, మండలస్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటీలను నియమించనున్నారు. ధాన్యం నాణ్యత, తేమ శాతంపై కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ధాన్యం కొనుగొలు కేంద్రాల వద్ద కంప్యూటర్లు, గోనె సంచులు, తూనిక యంత్రాలు, తేమశాతం కొలిచే పరికరాలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం మార్గదర్శికాలను జారీ చేసింది.

### దళారుల హవా..

ధాన్యం కొనుగోలు సీజన్ ప్రారంభం కాకముందే దళారుల మొదలైంది. వరిపంట కోత దశలో వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది రైతులు వరికోతలు చేపట్టి.. నూర్పుడి చేస్తున్నారు. ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం.. ధాన్యాన్ని భద్రపరిచేందుకు వీలులేక వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా కొంతమంది దళారులు పొలాల వద్దే ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

- 'గతేడాది పొలాల వద్ద 80కేజీల ధాన్యం బస్తాను రూ.1500కు కొనుగోలు చేశారు. ఈ ఏడాది కేవలం రూ.1320 నుంచి రూ.1350 వరకూ కొంటున్నారు. పేరుకే 80 కేజీలు కానీ.. తేమశాతం పేరిట అదనంగా మరో మూడు కేజీలు తూకం వేసి తీసుకుంటున్నారు. దీంతో మరింత నష్టపోతున్నాం. ప్రభుత్వమే త్వరగా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాల'ని పాతపట్నం మండలం కొరసవాడకు చెందిన నల్లి శ్రీను, బోను లోకేశ్, సీది గ్రామానికి చెందిన రాజాన గురయ్య తదితర రైతులు కోరుతున్నారు.

# నిలిచిన గ్రామీణ బ్యాంకు సేవలు

- నాలుగు బ్యాంకుల విలీనమే కారణం
- ఈ నెల 13న పునరుద్ధరణ




ఏపీజీవీబీ బ్యాంక్

ఇచ్ఛాపురం/శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. ఈ నెల 13 తేదీ ఉదయం 10 గంటల వరకు ఈ సేవలు ఉండవు. కేంద్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం నాలుగో విడత బ్యాంకుల విలీనంపై గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. మన రాష్ట్రంలో నాలుగు బ్యాంకులు ఒకే బ్యాంకు కింద విలీనం చేసింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంకులు ఉన్నాయి. ఇవన్నీ ఒకే సంస్థ కింద అంటే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మారనున్నాయి. సాంకేతిక సమస్యలను ఒక కొలిక్కి తెచ్చేందుకు గాను ఐదు రోజుల పాటు రాష్ట్రంలోని ఈ నాలుగు బ్యాంకులు సేవలను నిలిపివేశారు. జిల్లాలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు 80 శాఖలతో నడుస్తోంది.

### ఖాతాదారులకు అసౌకర్యం..

గ్రామీణ బ్యాంకుకు సంబంధించి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్, ఏటీఎం సేవలు, బ్యాంకుమిత్ర సేవలు సైతం నిలిచిపోయాయి. ఈ నెల 11 రెండో శనివారం కలిసి వచ్చింది. 12న ఆదివారం సెలవు దినం. అందుకే 13వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు గ్రామీణ వికాస్ బ్యాంకు అన్నపేరు వినిపించదు. ఇక నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగానే కనిపించనుంది. అయితే చాలామంది సేవలు నిలిపివేశారని తెలియక ఇబ్బందిపడ్డారు. ఏటీఎం కార్డులు పనిచేయక పోవడంతో అయోమయానికి గురయ్యారు. చివరకు అసలు విషయం తెలుసుకుని ఊపిరిపీల్చుకున్నారు.

### 3 రోజుల పాటు సేవలు నిలుపుదల..

మూడు రోజుల పాటు గ్రామీణ బ్యాంకుల సేవలు అందుబాటులో ఉండవని ఆ బ్యాంకు శ్రీకాకుళం జిల్లా రీజినల్ మేనేజరు లావేటి అనంతరావు తెలిపారు. తిరిగి అన్ని రకాల సేవలు ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్రంలో ఉన్న 4 గ్రామీణ బ్యాంకులు కలిసి ఒకే గ్రామీణ బ్యాంకుగా రూపాంతరం చెందడం వల్ల ఒకే సాఫ్ట్‌వేర్‌లోకి ఈ ఖాతాలన్నీ మారడానికి వీలుగా మూడు రోజులు అన్ని రకాల సేవలు నిలుపుదల చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈనెల 13 నుంచి తమ బ్యాంకు ఖాతాదారుల అకౌంటు నెంబర్లు, బ్యాంకు ఐఎఫ్ఎస్‌సీ కోడ్లు మారుతాయన్నారు. అయితే ఈ ఏడాది డిసెంబరు వరకు పాత అకౌంట్ నెంబర్లే వాడుకోవచ్చన్నారు. ఖాతాదారులకు ఇబ్బందులు వస్తే అయా శాఖ మేనేజర్లనుగానీ లేదా 18004256 708 టోల్‌ఫ్రీ నెంబర్‌గానీ సంప్రదించవచ్చన్నారు.

# ఉరుములుతో కూడిన వర్షం




లక్ష్మీనర్సుపేటలో కురుస్తున్న వర్షం

ఎల్ఎన్ పేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉరుముల శబ్దాలకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఉరుములు ఉరుముతున్న సమయంలో శబ్దాలకు ఎక్కడ పిడిగులుపడి ఎలాంటి ప్రాణహాని జరుగుతుందోనని భయాందోళనలు చెందారు. లోతట్టు ప్రాంతాలైన కోవిలాం, ధనుకువాడ, చిట్టిమండలం, తురకపేట పొలాల గుండా తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్యనున్న కడపలగెడ్డ గుండా దబ్బపాడు గ్రామం వద్ద వంశధార నదిలోకి వెలుతుంది. దీంతో లోతట్టు పంటపొలాలు నీట మునిగాయి.

# మునిసిపాలిటీల్లో ఈడీసీ

(ఐదో పేజీ తరువాయి)

సంఖ్యలో లేఅవుట్లు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 500కు పైగా లేఅవుట్లు ఉంటాయని అంచనా. నిబంధనల ప్రకారం నాలా చెల్లించని వారు కొత్తగా ప్రవేశపెట్టిన ఈడీసీ చట్టం ప్రకారం పన్నులు చెల్లిస్తే మునిసిపాలిటీలకు అదనంగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ చట్టాలను రెవెన్యూ, మునిసిపల్ అధికారులు కఠినంగా అమలు చేయాల్సి ఉంది.

- ఈ విషయంపై పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ కమిషనర్ ఎన్.రామారావు ప్రస్తావించగా.. 'కొత్త చట్టం అమలుపై ఇంకా విధివిధానాలు రావాల్సి ఉంది. నాలా పేరుతో అనేక వేల ఎకరాల భూమి దుర్వినియోగమైంది. ఆ చట్టంలో పది శాతం పన్ను చెల్లిస్తే ఇందులో కేవలం 4 శాతమే చెల్లించాలి. దీనివల్ల అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది. ఈ నిధులతో పురపాలక సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉంద'ని తెలిపారు.

# కుక్కలు చంపేస్తున్నాయ్!

(ఐదో పేజీ తరువాయి)

కుక్కల దాడులు పెరగడంతో విశాఖ నుంచి ప్రత్యేక బృందాలను రప్పించి నియంత్రణ చర్యలు చేపట్టారు. కానీ ఈ ప్రక్రియ కూడా నిలిచిపోయింది. దీంతో కుక్కల సంతతి పెరిగిపోయింది. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో అప్పట్లో 10వేల కుక్కలను గుర్తిస్తే.. కనీసస్థాయిలో కూడా నియంత్రణ ఆపరేషన్లు చేయలేదు. మిగిలిన మునిసిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి. కొన్ని రోజులకే ఈ కేంద్రాలు మూతపడ్డాయి.

### ● జీవోనే.. నిధులు లేవు..

కుక్కలు, పందుల నియంత్రణ విషయంలో గత వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో 2020 డిసెంబరు 30న వీధి కుక్కల నియంత్రణ బాధ్యత స్థానిక సంస్థలకు అప్పగిస్తూ జీవో జారీచేసింది. కానీ నిధులు మాత్రం కేటాయించలేదు. లైసెన్స్‌లు లేని జంతువుల నియంత్రణకు సరికొత్త మార్గదర్శకాలిచ్చింది. కుక్కలు, పందులు పెంచుకోవాలంటే అనుమతి తప్పనిసరి చేసింది. అనుమతి లేకుండా పెంచితే వాటి యజమానులకు రూ.500 అపరాధ రుసుం విధించాలని ఆదేశాలిచ్చింది. అయినా వినని యజమానులకు రోజుకు రూ.250 చొప్పున జరిమానా విధించాలని స్పష్టం చేసింది. లైసెన్స్ జారీ, రెన్యువల్ బాధ్యతలు స్థానిక సంస్థలు చూసుకోవాలని పేర్కొంది. యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసుకున్నట్టు ధ్రువపత్రం, పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్టు ధ్రువీకరణం పొంది ఉండాలని కూడా స్పష్టం చేసింది. కానీ ఇవెక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. జిల్లావ్యాప్తంగా ఏ ప్రభుత్వ ఆస్పత్రి రికార్డులు చూసుకున్నా కుక్కకాటు బాధితులు నెలలో పదుల సంఖ్యలో ఉంటున్నారు. కానీ ప్రస్తుత కూడా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం సుప్రీంకోర్టు ఆదేశాలతోనైనా వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

### సంతతి తగ్గించాలి..

పల్లెలు, పట్టణాల్లో కుక్కల సంతతి పెరుగుతుండడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్లలోకి సైతం కుక్కలు ప్రవేశిస్తున్నాయి. రెండేళ్ల కిందట జి.సిగడాం మండలంలో ఇంటిలోని ఉయ్యాలలో ఉన్న చిన్నారిపై దాడిచేసి చంపేశాయి. అయినా సరే అప్పట్లో అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా కుక్కల సంతతిని తగ్గించే ఏర్పాట్లు చేయాలి.

-ఆర్.సాయి, రణస్థలం

### తీవ్ర అసౌకర్యం..

ప్రతిరోజూ వీధి కుక్కలతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం. సమీప గ్రామాల నుంచి ఇక్కడకు చేరుతున్నాయి. హోటళ్లలో వ్యర్థాలు, ఇతర పదార్థాలను తింటున్నాయి. ఈ క్రమంలో ప్రజలపై విరుచుకుపడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీటి నియంత్రణపై దృష్టిపెట్టాలి.

-ఎం.శ్రీనివాసరావు, రణస్థలం

# పదేళ్లుగా రేషన్‌కు దూరం



హిరమండలం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోకొండ గిరిజన గ్రామానికి చెందిన గౌరమ్మకు గత పదేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులు అందడం లేదు. దివ్యాంగురాలైన ఈమె ఒంటరిగా జీవిస్తుంది. 2006లో ప్రభుత్వం గౌరమ్మకు అంత్యోదయ రేషన్ కార్డు మంజూరు చేసింది. అప్పటి నుంచి 10కిలో బియ్యం అందుకునేది. అయితే పదేళ్ల కిందట రేషన్ కార్డుల తనిఖీ సమయంలో ఈమె అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరింది. దీంతో ఆమె గ్రామంలో ఉండడం లేదని అధికారులు నిర్ధారించుకుని ఆ కార్డును రద్దు చేశారు. అప్పటి నుంచి రేషన్ కార్డు పునరుద్ధరణ కోసం అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ దివ్యాంగ వృద్ధురాలిరి రేషన్ కార్డు మంజూరు చేయలాని ఆ గ్రామస్థులు కూడా కోరుతున్నారు.

← రద్దు చేసిన రేషన్ కార్డును చూపిస్తున్న గౌరమ్మ



టీచర్‌ను చుట్టుముట్టి కన్నీరు పెట్టుకుంటున్న చిన్నారులు

# టీచర్.. మీరే ఉండాలి

- చిన్నారుల వేడుకోలు

ఇచ్ఛాపురం, అక్టోబరు 09 (ఆంధ్రజ్యోతి): టీచర్ మీరే ఉండాలి.. మీరు చదువుచెప్పాలంటూ ఆ పాఠశాల విద్యార్థులు కన్నీరు పెట్టుకుని వేడుకున్న ఘటన గురువారం కొఠారి గ్రామంలో సంభవించింది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సుమారు 9 ఏళ్ల పాటు ఉపాధ్యాయినిగా పనిచేసి టీ.బరంపురం పాఠశాలకు బదిలీపై వెళుతున్న శ్రావణికి గురువారం వీడ్కోలు పలికారు. అయితే ఆమెను పలువురు చిన్నారులు చుట్టుముట్టి కన్నీరు పెట్టుకుని వేడుకున్నారు. ఈ ఘటన చూసిన పలువురు మహిళలు సైతం కంట తడిపెట్టుకున్నారు. మంచి చదువులు చెప్పి ఎంతోమంది విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన టీచర్ వెళ్లకూడదని చిన్నారులు పదే పదే వేడుకున్నారు. పాఠశాల నుంచి బస్టాండ్ వరకు చిన్నారులు కన్నీరు పెట్టుకొని వెళ్లి టీచర్‌కు సాగనంపారు.

# వెండి మబ్బుల్లో..



పచ్చని పైరు.. ఆపై ఎత్తైన కొండలను తాకుతూ కనిపిస్తున్న ఆకాశంలోని వెండి మబ్బులు చూపరులకు కనువిందు చేశాయి. మనస్సును ఆహ్లాదపరుస్తూ ప్రకృతి ప్రేమికులను కట్టిపడేశాయి. ఈ దృశ్యం గురువారం సాయంత్రం పలాస- గొప్పిలి రోడ్డులో కనిపించింది.

-పలాస



## టీడీపీ నేత పాడె మోసిన ఎమ్మెల్యే శంకర్


పాడె మోస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ నేత గంగు ప్రభాకర్ మృతదేహానికి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభాకర్ అంత్య క్రియల్లో ఎమ్మెల్యే పాల్గొని పాడె మోసారు. ప్రభాకర్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు, తండ్రి దాలినాయుడు ఉన్నారు. వారిని ఎమ్మెల్యే పరామర్శించి తన సానుభూతి వ్యక్తంచేశారు. తల్లి గంగు సుందరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఏడాదిలో భార్య, కుమారుడు మృతి చెం దడంతో దాలినాయుడును ఓదార్చడం ఎవరితరం కాలేదు. ప్రభాకర్‌ను కడసారి చూసేందుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు, బంధువులు తరలి వచ్చారు. మృత దేహంపై టీడీపీ జెండానుకప్పారు.

## అవయవ దాత కుటుంబానికి స్థలం కేటాయింపు


అవయవ దాత కుటుంబానికి పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సోంపేటకు చెందిన విద్యార్థి ప్రేమ్ చంద్ అవయవాలను దానం చేసి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన కుటుంబానికి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. రామయ్యపుట్టుగలో స్థలానికి చెందిన పట్టాను ఆయన కుటుంబ సభ్యులకు గురువారం ఎమ్మెల్యే బి.అశోక్ అందించారు. ప్రేమ్ చంద్ చారి టబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసేందుకు కొజ్జిరియాలో స్థలాన్ని కేటాయించారు. కార్యక్రమంలో కంచిలి తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్, ఆర్ఐ కృష్ణరౌలో తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గజలక్ష్మి నవరాత్రి ఉత్సవాలు


నృత్యాభినయం చేస్తున్న విద్యార్థినులు

ఇచ్ఛాపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రత్తకన్న గ్రామం నాయుడు వీధిలో గజలక్ష్మి అమ్మవారి 11వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు గురువారం మండపం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు కళాకారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే స్థానిక గాయకులు సంగీత కచేరీ నిర్వహించారు.

## థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రతిపాదనను విరమించాలి

● మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ఆమదాలవలస, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పచ్చని పొలాల మధ్య థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టడం వల్ల ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు విఘాతం కలుగుతుందని, తక్షణం ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో కన్వీనర్ వాబయోగి అధ్యక్షతన బూర్జ మండలం మశానపుట్టి గ్రామంలో గురువారం రైతులు, ఆదివాసీలు, దళితులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ.. పచ్చని ప్రకృతిని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాల్సిన పాలకులు పవర్ ప్లాంట్ నిర్మాణంతో వారికి జీవించే హక్కు లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బలవంతపు భూ సేకరణకు ప్రయ త్నిస్తే చట్టబద్ధంగా పోరాటం చేసి అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో రైతు ఉద్యమాల వేదిక కన్వీనర్ మహదేవ్, ప్రజా సంఘాలు, వామపక్ష నేతలు తాండ్ర ప్రకాష్, గోవిందరావు, చాపర వెంకట రమణ, హరనాథ్, డి.వర్మ, వంకల మాధవరావు, సవర సింహాచలం పాల్గొన్నారు.

## బొల్లినేని మెడ్‌స్కిల్స్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు జెమ్స్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసిన బీఎస్సీ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులను పొందారు. అనస్థీషియా విభాగంలో తూతికరమ్య సాహితి మొదటి ర్యాంకు సాధించింది. అలాగే డిస్టింక్షన్‌లో 15 మంది, ప్రథమ శ్రేణిలో 43 మంది, ద్వితీయ శ్రేణిలో ఏగుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సిబ్బంది అంకితభావం, విద్యార్థులు క్రమశిక్షణతో విద్య అభ్యసించి ఈ ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం ఈ కోర్సుల్లో అడ్మిషన్లు కొనసాగుతున్నాయన్నా రు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీ పద్మజ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఖతార్‌లో నర్సు ఉద్యోగాలకు దరఖాస్తులాహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఖతార్ దేశంలో హోమ్ కేర్ నర్సు ఉద్యోగాల కు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖా స్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ కార్పొరేషన్ ఈడీ కె.కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఓవర్సీస్ మేన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ద్వారా జరిగే ఈ నియామ కాల్లో ఎంపికైన అభ్యర్థులకు నెలకు దాదాపు రూ.1.2లక్షల వేతనం లభిస్తుందన్నారు. టాక్స్ ఫ్రీ జీతంతో పాటు, ఉచిత నివాసం, వైద్య సదుపాయం, రవాణా, వీసా, విమాన ప్రయాణ టిక్కెట్లు తది తర సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తారన్నారు. అభ్యర్థులు భోజనం, సర్వీస్ చార్జీల రూపంలో రూ.30 వేలు మరియు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. బీఎస్సీ నర్సింగ్, లేదా జీఎన్ఎం పాసై, 21 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. 2 సంవత్సరాల అనుభవం ఉన్న మైనారిటీ యువత దరఖాస్తులను నైపుణ్యం. ఏపీ.జీఓవీ.ఇన్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుం దన్నారు. దర ఖాస్తు చేసుకున్నవారికి ఈనెల 13న విజయవాడలోని ఓఎంక్యాప్ కార్యాలయం, ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్, రమేష్ హాస్పిటల్ రోడ్డులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీ యువత ఈ ఉద్యోగావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సారా రహిత జిల్లా లక్ష్యం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సారారహిత జిల్లా లక్ష్యమని, ఈ దిశలో సారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవోదయం 2.0లో భాగంగా కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సారా రహిత జిల్లా తయారీలో భాగస్వామ్యం కావాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాట్లాడుతూ.. ఇప్పటివరకు 179 ఐడీ లిక్కర్ కేసులు నమోదు చేసి 221 మందిని అరెస్టు చేశామని, 3477.8 లీటర్ల ఐడీ మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. 27,790 లీటర్ల జేఎఫ్ వాష్‌ను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సారా తయారీకి వినియో గించిన 75 కిలోల బెల్లం, 17 వాహనాలను సీజ్ చేశామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఎక్సైజ్ శాఖ ఏసీ పి.రామచంద్రరావు, జిల్లాఅధికారి తిరుపతి నాయుడు, డీఎస్పీ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

### సురక్షిత నీటిని అందించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో విద్యా ర్థులకు సురక్షిత నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో సీజనల్ జ్వరాలు, పిల్లల ఆరోగ్యంపై అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. వసతి గృహాల్లో నీటిని క్రమం తప్పక పరీక్షిస్తూ విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. తాగునీరు, వైద్య సేవలతో పాటు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల రీ-అసెస్‌మెంట్, ఎస్సీ/ఎస్టీ అత్యాచార బాధితులకు పరిహారం చెల్లింపు, దేవాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. సమా వేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీ రాజ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈ అన్నం తినలేం

● రుచీపచీలేని మధ్యాహ్న భోజనం
● ఎంఎస్‌పల్లి జడ్పీ విద్యార్థుల ఆవేదన


అసంపూర్తిగా నిలిచిన అదనపు గదుల నిర్మాణం


భోజనాలు బాగాలేవని చూపిస్తున్న విద్యార్థినులు

కంచిలి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంఎస్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 401 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలకు రెగ్యులర్ ప్రధానోపాధ్యాయుడు లేకపోవడంతో ఇన్‌చార్జితో నెట్టుకొస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం రుచి, శుచి ఉండడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేకాకుండా పాఠశాలలో ఎన్నో సమస్యలు ఉన్నాయంటు న్నారు. వైసీపీ హయాంలో నాడు-నేడు కింద చేపట్టిన భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఇక్కడ 22 మంది ఉపాధ్యాయులకు గాను ఎక్కువ మంది వేరే పాఠశాలలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. కొందరు ఆఫీసు డ్యూటీల పేరిట బోధనకు దూరంగా ఉంటున్నారు. ఒకరిద్దరు సెలవుపై ఉంటున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా


సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్‌తో ప్రభు త్వం పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే, పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. బూర్జ మండలం కాశపర్తికి చెందిన సుంకర మన్మథరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.3.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మంజూరు పత్రాన్ని అతని మామ అదపాక అప్పలనాయుడుకు గురువారం అమరావతిలో అందించారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

● డీఈవో రవిబాబు

గుజరాతీపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రవిబాబు అన్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నూతన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు పాఠశాలల్లో నియమితులైన కొద్దిరోజులకే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, జి.చంద్ర భూషణ్, ఎంఈవోలు కృష్ణ వినోదిని, ఉమామహేశ్వరి, పి.ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పొందూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పొందూరు పంచాయతీ లక్ష్మీపేట గ్రామానికి చెందిన దర్శవరపు వెంకటరావు (44) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వెంకటరావు ఆర్థిక ఇబ్బందులు కారణంగా అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చలేక ఒత్తిడికి గురై పురుగులమందు సేవించాడు. అపస్మారక స్థితికి చేరుకున్న వెంకట రావును కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలో ఆసు పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌పై పూర్తి అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న కమిషనర్

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని నగర పాలకసంస్థ కమిషనర్ ప్రసాదరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్ ఆధ్వ ర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో గురువారం శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస మునిసిపాలిటీకి చెందిన వార్డు ఎనిమిటీస్ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పర్యావరణ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి ప్రతిరోజూ కొత్త విష యాలు నేర్చుకుంటూ పూర్తిస్థాయిలో నైపుణ్యం సంపాదించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

కవిటి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాజపురం ఏపీ మోడల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ పాణిగ్రాహి తెలిపారు. అండర్-19 వాలీబాల్ విభాగంలో బి.జ్ఞానేశ్వరరావు, ఎ.సంజయ్, ఎస్.పార్వతి, క్రికెట్‌లో ఇ.మహేష్, ఎం.అవినాష్, కబడ్డీలో జి.దీపిక, వాలీబాల్ అండర్-17 విభాగంలో డి.యమున, అండర్-14లో బి.సంతోష్ ఎంపికయ్యారని చెప్పారు. అలాగే బ్యాడ్మింటన్‌లో ఎ.తమన్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈమేరకు గురువారం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

### పతకం సాధించిన విద్యార్థికి అభినందన

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలో పతకం సాధించిన కె.శిరీషను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ గురువారం రామయ్యపుట్టుగలో అభినందించారు. 38వ జూనియర్ స్టేట్‌మీట్‌లో 3 వేల మీటర్లు స్టెపెచేజ్‌లో పతకం సాధించడం అభినందనీయమన్నారు. ఎస్‌వీజే పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### లావేరు పాఠశాల నుంచి..

లావేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు లావేరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెడ్‌మాస్టర్ పి.జగన్నాథరావు తెలిపారు. ఇటీవలన జిల్లాస్థాయిలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. 200 మీటర్ల పరుగు పందెంలో వై.రఘు, త్రోబాల్‌లో బి.తనూజ, వై.రఘు, వాలీబాల్‌లో వై.మహేష్ ఎంపికకయ్యారని చెప్పారు. బేస్‌బాల్ పోటీల్లో ఎ.జీవిత, ఎల్.లక్ష్మి, ఎ.భాను ప్రసాద్, ఎన్.ధనుష్, వై.కృష్ణ, ఎన్.రామకృష్ణ, ఎన్.కిషోర్, వై.రఘు, ఎస్.గోవింద ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఐ.తోటయ్యదొర, ఎస్ఎంసీ ఛైర్మన్ లంకలపల్లి రాంబాబు, హెచ్ఎం జగన్నాథరావు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్షుడు పిసిని వసంతరావు తదితరులు అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

## దళిత ద్రోహులు.. వైసీపీ నేతలు


అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం చేస్తున్న పీఎంజే బాబు తదితరులు

అరసవల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు దళిత ద్రోహులని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు అన్నారు. చిత్తూరు జిల్లా దేవళంపేటలో వైసీపీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని ఖండిస్తూ గురువారం ఆదివారంపేటలో వద్ద ప్లకార్డులు పట్టు కుని నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం నిర్వ హించి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పీఎంజేబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఎస్వీ రమణ మాదిగ, టీడీపీ నేతలు రాజారావు, కటారి కమల, కవ్వాడి రవి, లక్ష్మీనారాయణ, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్రధాన విజయరాం, రెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నిందితులను కఠినంగా శిక్షించాలి

కంచిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మద్రిపాటి పూర్ణచంద్రుడు, దళిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ నాయకుల ఆదేశాలతోనే ఈ దుశ్చర్యకు ఒడిగట్టారని, ప్రజాస్వామ్యంలో ఇటువం టివి తగవన్నారు. దళితులను అడ్డు పెట్టుకుని రాజకీయం చేయాలని చూస్తున్న వైసీపీ ప్రయత్నాలను దళిత సంఘ నాయకులు ప్రతిఘటించాలని కోరారు.

## ఉపాధి వేతనదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

పొందూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ ఈజీఎస్ పథకం పనులు చేపడుతున్న వేతనదారులు విధిగా ఈకేవైసీ (ఫేషియల్ అటెండెన్స్) చేయించుకోవాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. నందివాడ పంచాయతీలో ఈకేవైసీ ప్రక్రియను గురువారం పరిశీలించారు. ఫేషియల్ అటెండెన్స్ వేసిన వారికి మాత్రమే వేతనాలు వారి ఖాతాల్లో జమవుతాయన్నారు. ఈ విధానంతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చన్నారు. అన్ని గ్రామాల్లో వేతనదారులు ఈకేవైసీ చేయించే బాధ్యత ఎన్ఆర్ ఈజీఎస్ సిబ్బందిదేనన్నారు. ఉపాదినిధులతో చేపడుతున్న రోడ్లను, పశువుల షెడ్లను పరిశీలిం చారు. ఆయనతో పాటు ఏపీవో శ్రీనివాసరావు, ఈసీ నరేష్ తదితరులున్నారు.

## నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

ఎచ్చెర్ల, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో బోధనా, బోధనేతర పోస్టుల నియామకంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని దళిత ప్రజా సంఘాల జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్యను గురువారం కలిసి వినతిపత్రం అంద జేశారు. వినతిపత్రం అందించిన వారిలో దళిత ప్రజా సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, కుల నిర్మూల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, అంబేద్కర్ చైర్ సాధన సమితి జిల్లా కన్వీనర్ టి.రమణ తదితరులున్నారు.

### వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన వివాహిత మైలిపల్లి వరం (30) అదృశ్యంపై గురువారం శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. వాంబేకాలనీకి చెందిన మైలిపల్లి సూర్యనారాయణ, లక్ష్మిల కుమార్తె మైలిపల్లి వరానికి 2009లో అక్కివరం గ్రామానికి చెందిన కంది అప్పలరాజుతో వివాహం జరిగింది. గత కొద్దిరోజులుగా ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంది. ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో గతనెల 24న రిమ్స్‌లో చేర్పించి చికిత్సను అందిస్తుండగా 26వ తేదీ నుంచి ఆమె కనిపించకుండాపోయింది. ఆమె తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## న్యూస్ బాక్స్

### పాఠశాలకు బీరువా బహూకరణ

సోంపేట రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ఆర్మీ ఆర్డినరీ కెప్టెన్ పొట్టి సోమేశ్వరరావు లైబ్రరీ పుస్తకాలు భద్రపరిచేందుకు బీరువాను గురువారం అందించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

### గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ సమస్యలు, రోడ్డు కనెక్టివిటీ తదితర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఇంటి పన్ను వసూలు చేసి సొంత నిధులను సమకూర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.ప్రకాష్, డిప్యూటీ ఎంపీడీవో కె. సూర్యనారాయణ, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సచివాలయ జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సచివాలయ జేఏసీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. లొద్దపుట్టి ధనరాజ తులసమ్మతల్లి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ఛైర్మన్‌గా పొల్లాయి అశోక్, ప్రధాన కార్యదర్శిగా బి. మనోజ్, కన్వీనర్‌గా పి.తారకేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సల్ల ప్రవీణ్, వైస్ ఛైర్మన్‌గా జోగమ్మ, మల్లేష్, ట్రెజరర్‌గా బాలకృష్ణలతో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

### కవితల పోటీల్లో బంగారు పతకాలు

ఆమదాలవలస, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా రాష్ట్రం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శ్రీగౌత మేశ్వరా సాహితీ కళాసేవా సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ కవితా పోటీల్లో పట్టణానికి చెందిన కవులు కుప్పిలి వెంకట రాజారావు, కర్నేన జనార్దనరావు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. సెప్టెంబరు 20న నిర్వహించిన కవితల పోటీల్లో వీరు కవితలను వినిపించారు. ఈ సందర్భంగా కవులకు సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీదర్ బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను పోస్టులో పంపారు.

### ఎచ్చెర్ల ఏఎంసీ కమిటీ ఖరారు

లావేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఏఎంసీ నూతన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. కమిటీ ఛైర్మన్‌గా నిడిగంట్ల పద్మ, వైస్ ఛైర్మన్‌గా బూరాడ వెంకటరమణ లను నియమించారు. సభ్యులుగా అనకపల్లి రాజేశ్వరి, కోరాడ వెంకటనర్సింహమూర్తి, అడ్డాకుల వాసు, బూటు సునీత, టొంపల నీలవేణి, అలుపన మీనాక్షి, కెల్ల భారతి, చిల్లా రామసూరి, మహంతి అనంత, మాడుగుల శ్రీనివాసరావు, దండాసి రాంబాబు, గొర్లె దివ్య, పోతల చిరంజీవిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.





## లారీని ఢీకొన్న కారు



నుజ్జునుజ్జయిన కారు

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి సింగుపురం వద్ద గల ఫ్లైఓవర్‌పై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఫ్లైఓవర్‌పై ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా, కారులో ప్రయాణిస్తున్న ఒకరికి తీవ్ర గాయాలు, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం స్థానికుల సాయంతో హైవే సిబ్బంది శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

## బెంగళూరు వెళ్లేందుకు వచ్చి..

● రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రణస్థలం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దన్నానపేట సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మన్యం జిల్లా పాచిపెంట గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరు వెళ్లేందుకు బస్సు ఎక్కేందుకు ఉమామహేశ్వరరావు రణస్థలం వచ్చాడు. రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఉమామహేశ్వరరావు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హేమబాబు చౌదరికి పితృవియోగం



జగ్గు చౌదరి (ఫైల్)

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ దువ్వాడ హేమబాబు చౌదరి తండ్రి దువ్వాడ జగ్గుచౌదరి(78) గురువారం ఉదయం మృతిచెందారు. ఆయన గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా జగ్గు చౌదరి ఈ ప్రాంతానికి సుపరిచితులు. నగరంపల్లి, బొరువంక, కాశీబుగ్గ హైస్కూల్స్‌లో ఆయన పనిచేసి 2007న ఉద్యోగ విరమణ చేశారు. కాగా ఈయన భార్య దువాడ శార్యాణి చినవంక సర్పంచ్‌గా సేవలందించారు. ఈమె కూడా 2024లో మృతిచెందారు. ప్రస్తుతం వీరి పెద్ద కోడలు దువ్వాడ విజయలక్ష్మి సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. గురువారం ఉదయం స్వగ్రామం గుల్లలపాడులో అంత్యక్రియలు నిర్వహించారు. పంచాయతీతోపాటు పరిసర గ్రామాల ప్రజలు, ఆయన వద్ద చదువుకున్న విద్యార్థులు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.

## ప్రేమ పేరుతో మోసగించిన యువకుడు

● బూర్జ మండలంలో ఘటన.. కేసు నమోదు

బూర్జ (ఆమదాలవలస), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో ఓ గిరిజన బాలికను మోసగించిన ఘటన బూర్జ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బూర్జ మండలంలోని ఓ గిరిజన గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను సవర పవన్‌కుమార్(20) కొంతకాలంగా ప్రేమిస్తున్నట్టు, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆ బాలిక గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో అతడిని నిలదీశారు. ఈ విషయంలో తనకు సంబంధం లేదని తప్పించుకు నేందుకు పవన్ కుమార్ యత్నించాడు. గురువారం బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు బూర్జ ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు.

## పేకాట శిబిరంపై దాడి

● 8మంది అరెస్టు, రూ.51 వేలు స్వాధీనం

ఇచ్ఛాపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేదారిపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం రాత్రి కేదారిపురం శివాలయం మండపం వద్ద పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.51 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

నందిగాం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలం పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కుమార్ పట్నాయక్, వైస్‌ఎంపీడీవో కె.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడిగా కోరాడ రమణబాబు యాదవ్, గౌరవాధ్యక్షుడిగా కొర్రాయి కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా కంచరాన గోపినాథ్, కార్యదర్శులుగా టి.విశ్వేశ్వరరావు, కోశాధికారిగా బసవకుమారి, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.జానకమ్మ, సంయుక్త కార్యదర్శిగా డి.గౌతమి, సభ్యులుగా రాహుల్ రాయ్, హేమసుందర్, సంతోష్‌కుమార్, దిలీప్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

## శ్రీముఖలింగేశ్వరాలయ ఈవోగా ఏడుకొండలు



ఈవో ఏడుకొండలు

జలుమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా కె.ఏడుకొండలు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా పాతపట్నం నీలమణి దుర్గ ఆలయ ఈవో వాసుదేవరావు పనిచేస్తుండేవారు. ఇతడి స్థానంలో విజయనగరం పైడితల్లి అమ్మవారి దేవస్థానంలో పనిచేస్తున్న ఏడుకొండలు పదోన్నతిపై ఇక్కడ ఈవోగా నియమితులయ్యారు.

## తంపర బట్టి గండ్లను పూడ్చండి



గండ్లుపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దశ్యం

కొత్తూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వంశధార తంపర కాలువులకు గండ్లు పడిన వాటిని పూడ్చలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి అన్నారు. శుక్రవారం గండ్లు పడిన ప్రాంతాన్ని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పొలాల్లో ఇసుక మేటలు వేయడం వల్ల పంటలు పోవటం జరిగిందన్నారు. ఇరిగేషన్ అధికారులు ప్రసాదరావు, తేజేశ్వరావు, నీటిసంఘ అధ్యక్షుడు చంద్రరావు, తదితరులు ఉన్నారు.

## సమతుల ఆహారంతో ఆరోగ్యం

జలుమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని సారవకోట ఐసీడీఎస్ పీడీ వంశీప్రియ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన అన్నిశాఖలతో సమీక్షించారు. పోషక వారోత్సవాల్లో భాగంగా ప్రతీ అంగనవాడీ కేంద్రం పరిధిలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. ఏవో కె.రవికుమార్, ఏపీఎం హేమసుందర్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బగ్గు భవాని, అంగనవాడీ సూపరువైజర్లు, స్వయంశక్తి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# షెడ్డే గూడు.. చెట్టే నీడ!

● సొంతగూటికి నోచుకోని మందస అగ్నిమాపక కార్యాలయం
● పదిహేనేళ్లగా శిథిల భవనంలోనే..
● బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు
● పట్టించుకోని ఉన్నతాధికారులు



షెడ్డులో ఉన్న అగ్నిమాపక శాఖ కార్యాలయం, చెట్టు నీడన ఉన్న శకటం

హరిపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాద సమయాల్లో ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పిస్తున్న అగ్నిమా పక కార్యాలయానికి సొంత గూడు కరువైంది. సుమారు పదిహేనేళ్ల కిందట మందస కేంద్రంగా అగ్నిమాపక కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్లో శిథిలమైన షెడ్డులా మిగిలిపోయిన మండల కార్యాలయ సిబ్బంది క్వార్టర్స్‌లోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక అప్పటి నుంచి బితుకు బితుకుమంటూ అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు వాహనం ఉంచేందుకు నిలువ నీడలేక చెట్టుకిందనే నిలుపుతున్నారు. ఏ సమయంలో ఏం ప్రమాదం ముంచుకుస్తోందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్లుగా తుపాన్లు, అనంతరం ఏర్పడిన భారీ వర్షాలు సమయంలో వీరి సేవలు అత్యుత్తమంగా నిలిచాయి. వీరి సేవలను కొనియాడుతూ పలువురు అధికారులు అభినందనలు తెలిపారు. కానీ వీరికి పదిహేనేళ్లగా వేధిస్తున్న వసతి సమస్య మాత్రం తీరడం లేదు. ఇదే విషయమై పలుమార్లు ఉన్నతాధికా రులకు వేడుకోవడంతో నిధులు మంజూరయ్యాయి. ఆ తర్వాత నిర్మిస్తాం అంటూ చెబుతున్నారే తప్పా.. ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. దీంతో ప్రజల ఆస్తులను రక్షించే తమకే రక్షణ కరవైందని వారంతా నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. సొంత భవనం ఏర్పడితే తమ సేవలు మరింత విస్తృతం చేసి, విధి నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఫోన్ చేసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుంటామని మందస అగ్నిమాపక కేంద్రం సూపర్‌వైజర్ బాడ వల్లభరావు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే తమ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమించాలి




ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను అధిగమిస్తూ భూ రీసర్వే నిర్వహించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. కొరసవాడ గ్రామంలో గురువారం భూ రీసర్వేను ఎమ్మెల్యే ప్రారంభించారు. పెద్దవీధి కూడలిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ నిర్వహణ వైఫల్యాలను అధిగమిస్తూ ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా భూ రీసర్వే రూపొందించబడిందన్నారు. రైతుల సమక్షంలోనే భూ రీసర్వే అధికారులు నిర్వహిస్తామని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. శాశ్వత ప్రాతిపదికన భూ సమస్యల పరిష్కారాలు చూపేందుకు రీసర్వే వేదికగా నిలుస్తుందన్నారు. అనంతరం కొరసవాడ పెద్దవీధి కూడలి నుంచి ప్రధాన రహదారి గుండా రామమందిరం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బండి రవివర్మ, డివిజినల్ సర్వేయర్ ఎం.జనార్దనరావు, సర్వేయర్ వట్టి మహేష్, కూటమి నేతలు మద్దు రామారావు, మంచు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాగువాడలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను వారు సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు.

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

కొత్తూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన వరదలో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శుక్రవారం బంకివరం, మాకువరం, మాతల నివగాం, కుద్దిగాం, అంగూరు గ్రామాల్లో పర్యటించారు. వంశధార నదిలో నీటిప్రవాహం పెరగడం వల్ల పొలాల్లోకి నీరు వచ్చి చేరి పంటలు నష్టపోయారన్నారు. టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

## రూ.50లక్షల పరిహారం చెల్లించాలి

టెక్కలి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం జంగాలపాడు వద్ద రాజ్‌యోగ్ గ్రానైట్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన హేమరాజ్, రామ్ సునీల్, శ్రావణ్ కుమార్‌ల కుటుంబీలకు యాజమాన్యం రూ.50 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధానకా టర్యదర్శి తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జిల్లా గ్రానైట్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి హెచ్ ఈశ్వరరావు, గ్రానైట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతాడ తేజేశ్వరరావు, నంబూరు షన్ముఖరావు, మధుపాల్ వర్కర్స్ పాల్గొన్నారు.

## నిధులు సమకూర్చుకోవాలి

జలుమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని వాటినుంచి వచ్చే ఆదాయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో రఘునందాచారి, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## జిల్లేడు ద్రావణంతో తెగుళ్ల నివారణ

ఎల్.ఎన్ పేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వరి పంటలను నష్టపరిచే తెగుళ్లను నివారించేందుకు జిల్లేడు ద్రావణాన్ని డ్రోన్ సాయంతో పిచ్‌కారి చేస్తే ప్రయోజనం ఉంటుందని యూనిట్ ఇన్‌చార్జి బి.లలిత తెలిపారు. యంబరాం గ్రామంలో పొన్నాన. రామారావు పొలంలో సేంద్రీయ పద్ధతిలో తయారుచేసిన జిల్లేడు ద్రావణాన్ని డ్రోన్ సాయంతో గురువారం పిచికారీ చేయడంపై అవగాహన కల్పించారు. సేంద్రీయ జిలేడు ద్రావణం పంటపొలాలకు డ్రోన్‌ద్వారా పిచ్‌కారి చేయడం వల్ల శారీరక శ్రమఉండదన్నారు. సీడీఐ ఈశ్వరరావు, ఐసీఆర్‌పీ బి.పూర్ణారావు, బి.పవన్‌కల్యాణ్, రైతులు పాల్గొన్నారు.

## జీఎస్‌టీ తగ్గింపుపై అవగాహన



మాట్లాడుతున్న మలేరియా విభాగ పర్యవేక్షణాధికారి రవికుమార్

పోలాకి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్‌టీ తగ్గింపుపై గురువారం పోలాకి పీహెచ్‌సీ కేంద్రంలో సిబ్బందితో సదస్సు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. తగ్గింపు వల్ల జీవన రక్షక ఔషధాలపై వైద్యపరికరాలపై హెల్త్ ఇన్సూరెన్స్‌పై ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, మలేరియా విభాగ పర్యవేక్షణాధికారి, నల్లి రవికుమార్ తెలిపారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు దీర్గాసి, కోడూరు, పిన్నింటిపేట, గుప్పెడుపేట, గొల్లలవలస, డోల, తలసముద్రం గ్రామాల్లో హెల్త్‌వెల్ కేంద్రాల సిబ్బంది, ఆశ కార్యకర్తలు వైద్యసిబ్బంది ప్రజలకు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బలగ వెంకట సూర్యప్రకాష్, ఈవోపీఆర్‌డీ బి.పద్మావతి, హెల్త్‌వెల్ కేంద్రాల నిర్వాహకులు, వైద్యసిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

పోలాకి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వృత్తివిద్యాకోర్సు బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతి పద్మలత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్ ఇంజనీరింగ్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 14వతేదీ సాయంత్రంలోగా దరఖాస్తులు శ్రీకాకుళం బాలుర జూనియర్ కళశాలలో అందచేయాలన్నారు. ఈ నెల 15న ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. ఇతర వివరాలకు 9985611389 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందన

పోలాకి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో నిర్వహించిన 44వ జాతీయ సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ పోటీల్లో ఏపీ బాలుర జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ జట్టులో స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాలలో చదువుతున్న టి.అఖిల్ పాల్గొని సత్త చాటడంపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అభినందించారు. ఈ మేరకు గురువారం మబగాంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను అఖిల్ కలుసుకున్నాడు. తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌లో గత నెల 25 నుంచి 30వ తేదీ వరకూ ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాయికన్నా, ఉపాధ్యాయులు భాస్కరరావు, నర్సింగరావు, మధు తదితరులు పాల్గొన్నారు.

## చర్చ లేకుండానే ముగిసిన సమావేశం

వజ్రపుకొత్తూరు. అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఎలాంటి చర్చ లేకుండనే ముగిసింది. గురువారం వైస్ ఎంపీపీ వంక రాజు అధ్యక్షతన మండల సర్వ సమావేశం జరిగింది. కోరం లేకపోవడంతో ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. ఏడుగురు ఎంపీటీసీలు మాత్రమే హాజరు కావడం, అధికారులు సైతం పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఎలాంటి చర్చలు జరగలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాల పైనే కొంతమంది సభ్యులు మాట్లాడారు. అనంతరం సభ ముగిస్తున్నట్టు ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు ప్రకటించారు. కాగా బుధవారం కూడా కోరం లేకపోవడంతో సభ వాయిదా పడిన విషయం తెలిసిందే. గురువారం కూడా పూర్తిస్థాయిలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కాకపోవడంతో తూతూ మంత్రంగా సాగిపోయింది.

## అవగాహన కలిగి ఉండాలి

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ తగింపుపై అవగాహన కలిగి ఉండాలని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ ఆయూష్ వైద్యరాలు మణి అన్నారు. గురువారం వజ్రపుకొత్తూరు సచివాలయంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో జీఎస్‌టీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్‌కు సంబంధించి వివిధ పాలసీలు, జీఎస్‌టీ మిగలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అర్సవల్లి ఉమామహేశ్వరరావు, పీహెచ్‌సీ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నిరంతర సేవలు



మాట్లాడుతున్న బీపీఎం వెంటేష్

పాతపట్నం అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిరంతర సేవలందించడంలో తపాలా శాఖ అగ్రగామిగానే నిలుస్తుందని పాతపట్నం తపాలా కార్యాయల బ్రాంచి పోస్టు మాస్టర్ జె.వెంటేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ తపాలా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాతపట్నంలో గల తపాలా కార్యాలయాన్ని విద్యార్థులు సందర్శింపజేశారు. హెచ్ఎం ఎస్.వైకుంఠరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వరిసాగులో కాలిబాటలతో మేలు

కోటబొమ్మాళి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వరి పంటలో ప్రస్తుతం సోకుతున్న సుడిదోమ నివారణకు కాలిబాటలు తీసుకోవాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహన్‌రావు అన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావుతో కలిసి దుప్పిలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ సుడి దోమ నివారణకు ఎసిఫేట్ 300 గ్రాముల మందును ఎకరాకు స్ప్రే చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వనరులు సేకరించుకోవాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి వనరులు సేకరించుకోవాలని మండల పరిషత్ కార్యాలయ ఏవో కె.నారాయణరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో ఇన్‌చార్జీ డిప్యూటీ ఎంపీడీవో పల్లి వెంకటేష్, రిసోర్సు పర్సన్ బి. బాలకృష్ణ, సీనియర్ కార్యదర్శి బి. నరేష్ తదితరులు ఉన్నారు.

## తాత్కాలిక రహదారి నిర్మాణం



వజ్రపుకొత్తూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దబడాం వద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలుకు నిలిచిపోయాయి. ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే శిరీష కృషితో తాత్కాలికంగా రహదారిని నిర్మించినట్టు పీఆర్‌ఐ జేఈ రాజభూషణ్ చెప్పారు.

## నేటి నుంచి బోధనేతర పనులు బహిష్కరణ

నరసన్నపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధనా సమయం హరించుకుపోతున్న తరుణంలో ఉపాధ్యాయులంతా శుక్రవారం నుంచి బోధనేతర పనులు బహిష్కరించడం జరుగుతుందని ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంఈవోకు వినత పత్రంను అందజేశారు. గురువారం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. కార్యాక్రమంలో యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఎస్‌టీయూ, డీటీఎఫ్, హెచ్ఎం, అప్టా, పీఈటీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● నందిగాం: పాఠశాలలో విద్యాబోధనలో అడ్డంకిగా ఉన్న యాప్‌లను శుక్రవారం నుంచి బహిష్కరిస్తామని ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఎంఈవో జి.నర్సింహులు వినతి పత్రాన్ని గురువారం ఉపాధ్యాయులు అంద జేశారు. ఫ్యాప్టో ప్రతినిధులు బి.శంకరరావు, కృష్ణారావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

● గుజరాతీపేట: ఉపాధ్యాయ విధులు, విద్యార్థుల మధ్యాహ్న భోజన పథక నిర్వహణ తప్ప బోధనేతర కార్యక్ర మాలను శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో ఛైర్మన్ బి.శ్రీరా మ్మూర్తి, కార్యదర్శి పి.ప్రతాప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఈవో రవిబాబులకు మెమొరాండంలు ఇచ్చామన్నారు. ఇప్పటికే బోధనేతర కార్యక్రమాల వల్ల విద్యార్థులకు నాణ్యమైన బోధన అందక, సమయం చాలక విద్యార్థుల అభ్యసన కుంటుపడుతోందన్నారు. ప్రభుత్వం దృష్టికి అనేకమార్లు సమస్యలను తీసుకు వెళ్లినప్పటికీ పట్టించు కోకపోవడంతో బహిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్యులు బి.రవికుమార్, బి.వెంకటేశ్వర్లు, వి.సత్యనారాయణ, జి.రమణ పాల్గొన్నారు.

● కవిటి: ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయులంతా శుక్రవారం నుంచి యాప్‌లను బహిష్కరించి కేవలం బోధనకే పరిమితమవుతారని ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు. గురువారం ఎమ్మార్సీ వద్ద ఎంఈవో ధనుంజయకి వినతిపత్రం అందించారు. పలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పోలాకి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాను శుక్రవారం పలు గ్రామాల్లో నిలుపుదల చేస్తున్నట్టు టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఈఈ నరసింహకుమార్, ఏఈ బి.విశ్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల చేపట్టనుండడంతో సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. దీంతో గొల్లలవలస, కొండలక్కివలస, తోటాడ, స్టోన్ క్రషన్ ఆక్వా చెల్లాయివలస, డోల, గోవిందపురం, ఉర్లాం, చెల్లాయివలస, రాజారాంపురం, అంపలాం, రేవుఅంపలాం, నందిగాం, మొగివిల్లిపేట, మెట్టపేట, అంబీరుపేట తదితర గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ విద్యుత్ నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

## పాఠశాలకు ప్రయోగశాల

సంతబొమ్మాళి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వల్లేవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థి కోరాడ రవీంద్ర విద్యార్థుల కోసం ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. గురువారం పాఠశాలలో ఈ ప్రయోగశాలను ఎంఈవోలు జలుమూరు చిన్నవాడు, అర్జునుడు ప్రారంభించారు. ఈ ప్రయోగశాల వల్ల పాఠశాల విద్యార్థులు సైన్సు సబెక్టుపై పూర్తిస్థాయిలో అవగాహన కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారావు, విద్యా కమిటీ ఛైర్మన్ ఇప్పిలి అప్పన్న, మనబడి అసోసియేషన్ సభ్యులు రెడ్డి సూరిబాబు, కుటుంబసభ్యులు కోరాడ సావిత్రమ్మ, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సత్ప్రవర్తనతో మెలగాలి

పలాస రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యాభ్యాస కాలంలో సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ సూర్యనారాయణ అన్నారు. పలాస మండలం రంగోయి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థులు విద్యాభ్యాసన కాలంలో ఇతర వ్యాపకాలపై దృష్టిసారించకుండా లక్ష్యసాధనతో చదువుకోవాలన్నారు. పాఠశాలలో గాని, ఇతర చోట్ల గాని లైంగిక వేధింపులు ఏర్పడినప్పుడు కచ్చితంగా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. హెచ్ఎం యు.రమేష్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాలు అభివృద్ధి చేసుకోవాలి

పలాస రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సొంత ఆదాయ వనరులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని మాస్టర్ ట్రైనీ సద్గుణ, రీసోర్స్‌పర్సన్ పి.ఆనందరావు అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సొంత ఆదాయవనరుల సమీకరణ-అభివృద్ధిపై ప్రణాళికల నిర్వహణ అనే అంశంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీకి చెందిన అద్దెలు, పన్నులు, ఖాళీ స్థలాలపై ఆదాయం, చెరువులు, ఇతర స్థలాలపై ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. ఏవో అనురాధ, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● మందస: సొంత ఆదాయ వనరులతో పంచాయతీని అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల సొంత ఆదాయవనరుల పెంపు-ప్రణాళికాభివృద్ధి, సమీకరణపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ట్రైనీర్ జయప్రకాష్ పలు అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ అందించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● నందిగాం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు, కార్యదర్శులు పాటుపడాలని ఎంపీడీవో కుమార్‌పట్నాయక్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సొంత ఆదాయ వనరులపై శిక్షణా తరగతులను నిర్వహించి మాట్లాడారు. వైస్ ఎంపీడీవో సంతోష్ కుమార్, మాస్టర్ ట్రైనీ గోపినాథరావులు వివరించారు.

● ఎల్ఎన్ పేట: పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేసుకొనేందుకు సంపదను సృషించుకోవాలని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచ్‌లు, పంచాయితి కార్యదర్శులు పాల్గొన్నారు.

## రీసర్వే వినియోగించుకోవాలి

నందిగాం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావు కోరారు. గురువారం మండలంలోని కృష్ణరాయపురం, మొగలిపాడు గ్రామాల్లో రీసర్వేపై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించి మాట్లాడారు. సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండి భూముల వివరాలను సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మెట్ట పద్మావతి, రీసర్వే డీటీ ఆర్.రామారావు, మండల సర్వేయరు హనుమంతరావు, సర్పంచ్‌లు శాంతారావు, ఎర్రన్న, వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు ఉన్నారు.

## నేడు ఉపాధ్యాయుల నిరసన

టెక్కలి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఎంఆర్‌సీ వద్ద శుక్రవారం జరగనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండశాఖ నాయకులు వి.ఆదినారయణ, శ్రీనివాసరావు, బాబూరావు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు భారంగా ఉన్న యాప్‌లను బహిష్కరించి, విద్యార్థులు భోజన ఫొటోలు మాత్రమే అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. సంఘ పిలుపుమేరకు శనివారం మండల విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

## చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

హరిపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతిరావు సూచించారు. మందస మండలం సొండిపూడి హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ పాల్గొని మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు, మారకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదలపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది డిల్లేశ్వరరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు ఆహారం అందజేత

హరిపురం, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురం సీహెచ్‌సీలో ఆరోగ్య పరీక్షల కోసం వచ్చిన సుమారు 160మంది గర్భిణులకు కోస్టల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆహారం ప్యాకెట్లతోపాటు తాగునీటి సీసాలు గురువారం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మార్పు వెంటకేశం, వైఎస్ఎన్ మూర్తి, ఆసుపత్రి సూపరింటెండెంట్ యు.స్వరాజ్యలక్ష్మి క్లబ్ ప్రతినిధులు ఎం.లక్ష్మణరావు, పి వాసుదేవు, జోగారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.